పిల్లలతో వెట్టిచాకిరీ చేయించొద్దు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేద్దాం

అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : పిల్లలతో వెట్టిచాకిరీ చేయించొద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని మిని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆపరేషన్ స్మైల్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆపరేషన్ స్మైల్ 11ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్క అధికారి సమన్వయంతో పక్కా ప్రణాళికలు రూపొందించుకొని బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా కృషి చేయాలన్నా రు. ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యమైనదని, దానిని అనుభవించడం ప్రతి పౌరుడి హక్కు అని గుర్తుజేశారు. క్షణికావేశంలో పిల్లలు తొందరపాటులో చిన్నచిన్న విషయాలకే తల్లిదండ్రులను విడిచి ఇంటికి దూరంగా ఉంటున్నారన్నారు. దీనిని అవకాశంగా తీసుకొని కొందరు ప్రమాదకరమైన పనుల్లో దింపుతున్నారన్నారు. ఇంటికి దూరంగా ఉండే పిల్లలతో ప్రమాదకర పనులు చేయిస్తూ అయాకుల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. అపరేషన్ స్మైల్ మస్కాన్‌లో భాగంగా 21 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. దర్పన్ అప్లికేషన్ ద్వారా తప్పి పోయిన పిల్లలను వెతికి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచిన అనంతరం తిరిగి తల్లిదండ్రులకు అప్పగించనున్నట్లు తెలిపారు. భిక్షాటన చేస్తున్న బాల కార్మికులను గుర్తించి ఎప్పటి కప్పుడు సమాచారం ఇవ్వడానికి చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 112లకు ఫోన్‌చేసేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. పాఠశాలలకు వెళ్లకుండా డ్రాప్ అవుట్ అయిన పిల్లల తల్లీదండ్రులకు నచ్చిజెప్పి తిరిగి వారిని పాఠశాలలో చేర్పించేలా చూడాలన్నారు. ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే 100కు డయల్ చేసి, సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీడబ్ల్యూసీ చైర్మన్ అంజయ్య, డీఎంహెచ్‌వో రజిత, ఎస్ఐ రమేశ్, షీటీం ఏఎస్ఐ ప్రమీల, అధికారులు పాల్గొన్నారు.

సహకార సొసైటీ ఏర్పాటు చేయండి

సిరిసిల్ల జిల్లా వల్లంపట్లలో రైతుల ధర్నా

వల్లంపట్ల గ్రామంలో ధర్నా చేస్తున్న రైతులు, ప్రజలు

ఇల్లంతకుంట రూరల్, జనవరి 3 : తమ గ్రామంలో సహకార సొసైటీని ఏర్పాటు చేయాలని వల్లపంట్ల రైతులు, ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామ బస్టాండ్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. కందికట్కూర్‌లో సహకార సొసైటీ ఏర్పాటు చేయాలని గురువారం జరిగిన సహకార చైర్మన్ల సమావేశంలో ప్రతిపాదన చేయడం సరికాదన్నారు. గతంలో వల్లంపట్ల పేరు మీదనే ఓబులాపూర్, వల్లంపట్ల గ్రామాల మధ్య సహకార సొసైటీ ఉండేదని గుర్తు చేశారు. వల్లంపట్ల కేంద్రంగా సహకార సొసైటీ ఏర్పాటు చేస్తే ఓబులాపూర్, గూడెపుపల్లి, కిష్టారావుపల్లి, ముస్కుపల్లి, వెల్జిపూర్, రహీంఖాన్ పేట, ఎర్రనర్సుపల్లి గ్రామాలకు కేంద్రంగా ఉంటుందని తెలిపారు. అనంతరం జిల్లా సహకార అధికారి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, మాజీ సర్పంచులు కట్ట గురువారెడ్డి, మ్యాకల శ్రీనివాస్, ముస్కు మల్లయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గజ్జెల రాజశేఖర్, పీఏసీఎస్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, ఎలుక అనిల్, నాయిని రమేశ్ పాల్గొన్నారు.

మురుగునీటి కాల్వలోపడి ఒకరి మృతి

తెలంగాణ చౌక్, జనవరి 3: సిరిసిల్ల పట్టణంలోని పద్మానగర్‌లో వ్యక్తి మద్యం మత్తులో మురుగునీటి కాల్వలో పడి గురువారం రాత్రి మృతి చెందినట్లు టౌన్ సీఐ కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు బెల్లంపల్లిలోని రడగంపాల బస్తీకి చెందిన కల్యాడపు సుభాష్ (63) గత పదేళ్ల క్రితం భార్య, పిల్లల్లో గొడవపడి పట్టణంలోని పద్మానగర్‌లో ఓ ఇంట్లో మరో ఇద్దరితో కలిసి కిరాయికి ఉంటూ దినసరి కూలీపనులకు వెళ్తున్నాడు. తాను ఉంటున్న ఇంట్లో నుంచి గురువారం సాయంత్రం ఆరుగంటలకు వెళ్లినట్లు అదే ఇంట్లో ఉంటున్న వారు పేర్కొన్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న మురుగునీటి కాల్వలో మద్యం మత్తులో వ్యక్తిపడిపోయినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, అక్కడికి చేరుకున్న పోలీస్‌లు బయటకు తీయగా అప్పటికే చనిపోయినట్లు పేర్కొన్నారు. కొడుకు రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రమేశ్‌ను పరామర్శిస్తున్న రసమయి బాలకిషన్

మాజీ ఎమ్మెల్యే రసమయి పరామర్శ

ఇల్లంతకుంట రూరల్, జనవరి 3 : మండలంలోని తిప్పాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బీ రమేశ్ తల్లి అనారోగ్యంతో మృతి చెందగా, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రమేశ్‌ను శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, కేవీఎన్ రెడ్డి, సంతోష్ రెడ్డి తదితరులున్నారు.

ఇంగ్లిష్ టీచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

ఇల్లంతకుంట, జనవరి 3 : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మండల ఇంగ్లిష్ టీచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత మాట్లాడుతూ, ఇంగ్లిష్‌లో విద్యార్థులను మరింత పరిజ్ఞానం పెంచడం కోసం ఈ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి ఇంగ్లిష్‌లో తన ప్రతిభ చూపేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ టాలెంట్ టెస్టులో గెలుపొందిన విద్యార్థులకు బహుమ తులు అందజేశామన్నారు. ఉపాధ్యాయులు ఐరెడ్డి ప్రదీప్‌రెడ్డి, తూంకుంట నరేందర్‌రెడ్డి, రమణారెడ్డి, పద్మలత, స్వామి రెడ్డి, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు తూంకుంట మోహన్ రెడ్డి, సార మల్లేశం, కోహెడ రాజయ్య తో పాటు వివిధ గ్రామాల విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు ఆదర్శం పూలే

పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 3: భవిష్యత్ తరాలకు సావిత్రిబాయి పూలే ఆదర్శ వంతురాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మాజీ జడ్పీ చైర్ పర్సన్ న్యాల కొండ అరుణ అన్నారు. సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూలే చిత్రపటం వద్ద వారు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రం థాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిం దం చక్రపాణి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, కుంబాల మల్లారెడ్డి, గజ బీంకార్ రాజన్న, జక్కుల యాదగిరి, వీర బత్తిని కమలాకర్, సిరిగిరి మురళి, కొక్కుల ఆంజనేయులు, దార్ల సందీప్, నాయకులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తూనే విమర్శలా..

ఎల్లారెడ్డిపేట, జనవరి 3 : ఓ పక్క రైతులకు రైతుబంధు ఇవ్వకుండా, 2 లక్షలు పూర్తిగా రుణమాఫీ చేయకుండా మోసం చేస్తూనే తమ పార్టీపై బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నర్సయ్య విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాష్ విమర్శించారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను నిరసిస్తూ ఎల్లారెడ్డిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరికి రూ.5 వందల బోనస్ ఇస్తామని కేవలం సన్న వడ్లు కొన్నింటికే ఇచ్చి చేతులు దులుపుకుంది వాస్తవం కాదా . వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఫొటోలు దిగి నెలల తరబడి కొనకుండా తాత్సారం చేస్తే 70 శాతంపైగా ధాన్యం రైతులు బ్రోకర్లకు అమ్ముకున్న పరిస్థితిని చూడలేదా? అని దుయ్యబట్టారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ఉన్నారు.

సదరంను వినియోగించుకోవాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 3 : జిల్లా దవాఖానలో నిర్వహించే సద రం శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు మీ సేవ కేంద్రాల్లో స్లాట్‌లు బుక్ చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చే సమయంలో సంబంధిత మెడికల్ సర్టిఫికెట్లతో పాటు ఎక్స్ రే తీసుకురావాలని తెలిపారు.

అన్నపూర్ణ నుంచి నీటి విడుదల

ఇల్లంతకుంట రూరల్,జనవరి 3: మండలంలోని అనంతగిరి(అన్నపూర్ణ) రిజర్వాయర్ ఓవర్ ఫ్లో గేట్ల ద్వారా 60 క్యూసెక్కుల మేరకు ఎమ్మెల్యే సత్యనారాయణ ఆదేశాల మేరకు నీటిపారుదల శాఖ అధికారులు ఓవర్ ఫ్లో గేటు ద్వారా పెద్దలింగాపూర్ ఒర్రెలోకి విడుదల చేశారు. అధికారులు నీళ్లు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఇల్లంతకుంట, జనవరి 3 : మండలం లోని సోమారంపేట ఉపాధిహామీ ఫీల్డ్ అసి స్టెంట్ నర్సయ్య ఉపాధిహామీ పనులలో అవినీతి చేస్తూ, అడిగిన వారిని బెదిరింపుల కు గురి చేస్తున్నాడనే ఫిర్యాదు మేరకు.. డీఆర్డీవో ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఒకరిపై కేసు నమోదు

తెలంగాణ చౌక్, జనవరి 3 : వాట్సాప్ గ్రూప్‌లో ఒక వర్గానికి చెందిన వారిని కించ పరిచి మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పట్టణానికి చెందిన నాగుల శ్రీనివాస్ గత నెల 31న బీజేపీ సిరిసిల్ల టౌన్ వాట్సాప్ గ్రూప్‌లో విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టగా, అదేరోజు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, మరికొంతమంది వ్యక్తులు ఉద్దేశ్యపూర్వకంగా రెచ్చగొట్టె ప్రయత్నం చేస్తున్నారని, మళ్లీ అదేవిధంగా చేస్తే వారిపైకూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మతాలను, వర్గాలను కించపరుస్తూ ప్రజల మధ్య విద్వేషాలు వచ్చేలా పోస్టులు పెట్టిన, ఫార్వర్డ్ చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరామర్శ..

పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేములవాడ, జనవరి 3 : వేములవాడ పట్టణంలోని సాయినగర్ చెందిన కొప్పు సుధాకర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ గౌడ్, ప్రేమ్ చారి, భగవాన్ ఉన్నారు.

యువకుడికి ఆర్థిక సాయం అందజేత

ఇల్లంతకుంట, జనవరి 3 : మండలంలోని పెద్దలింగాపూర్‌నకు చెందిన కీర్తి రాజు అనే యువకుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, వైద్య సహాయం కోసం గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రమేశ్, పాలకవర్గ సభ్యులు ఆర్థిక సాయంగా రూ. 50 వేల నగదు అందజేశారు. భిక్షపతి, కీర్తి చిన్నమల్లయ్య, ఎల్లయ్య, రవి, పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ మహమ్మద్ యూసుఫ్, S/o.అజ్మీత్, R/o. బాలనగర్, వేములవాడ పట్టణం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన కూళిన రేకుల ఇల్లు (H.No. 2-150/2), యొక్క ఖాళీస్థలం మొత్తం విస్తీర్ణం: 242.00 చ.గజాలు, శాత్రాజుపల్లి గ్రామం, వేములవాడ పట్టణం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 03-01-2025 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్సి., ఎల్.ఎల్.బి.,
సిద్ధర్థనగర్, సిరిసిల్ల, జి|| రాజన్న సిరిసిల్ల.

ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల ఘర్షణ

బోయినపల్లి, జనవరి 3 : బోయినపల్లి ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ఐదుగురు బుధ వారం బెంచీల కోసం గొడవపడ్డారు. ముగ్గురు విద్యార్థులు కలిసి ఇద్దరు విద్యార్థులను కొట్టినట్లు తెలిసింది. ఈ విషయాన్ని దెబ్బలు తిన్న విద్యార్థులు దల్లిదం డ్రులకు చెప్పగా, వారు గురువారం పాఠశాలకు వచ్చి తరగతి గదిలోకి వెళ్లి ఉపాధ్యాయుడి ముందే గొడవపడిన విద్యార్థులను కొట్టి, ఆందోళన చేశారు. దీంతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం అందజేశారు. హుటా హుటిన ఏఎస్ఐ కానిస్టేబుల్స్ పాఠశాలకు చేరుకున్నారు. అయినా వారు శాంతించకుండా ఆందోళన చేయగా, వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు హాజరవ్వాలి

వీర్నపల్లి, జనవరి 3 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను అడవిపదిర గ్రామస్తులు శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 5న గ్రామంలో జరిగే అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానపత్రిక అందజేశారు. ఇక్కడ టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఆర్బీఎస్ మాజీ మండలాధ్యక్షుడు ఎడ్ల సాగర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, నేతలు తిప్పవరపు భాస్కర్, బైరి భాస్కర్ ఉన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

వేములవాడ, జనవరి 3 : క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని ఏఎంసీ చైర్మన్ రాజు సూచించారు. వేములవాడ పట్టణంలో ఎస్ఆర్ఆర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. ఎస్ఆర్ఆర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ నిర్వాహకుడు సత్తిపండు మాట్లాడుతూ, నాలుగో సంవత్సరం కూడా ప్రీమియర్ లీగ్ క్రికెట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో మొదటి విజేతకు 20 వేల నగదు, రెండో విజేతకు 10వేలు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాగరం వెంకటస్వామి, పుల్కం రాజు, ఆర్గనైజర్ సత్తిపండు. సంతోష్, విష్ణు, మధు మహేశ్, సోహెల్ తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 3 : స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీఎంహెచ్‌వో రజిత సూచించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన అడ్వైజరి కమిటీ సమావేశంలో ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు సదరు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పీసీపీఎన్‌డీటీ సర్టిఫికెట్లలలో తప్పనిసరిగా రేడియాలజిస్ట్ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ధరల పట్టికలు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సూచిక బోర్డులపై ఏర్పాటు చేయాలన్నారు. లింగనిర్ధారణ చేసినట్లు నిర్ధారణ అయితే స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు రూ. పది వేలు జరిమానా విధించడంతో పాటు మూడేళ్లు జైలు శిక్ష విధించనున్నట్లు తెలిపారు. పీవోఎం సీహెచ్ అంజలి, జిల్లా జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

సరస్వతీ నిలయం.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

- మందు బాబులకు నిలయమైన పాఠశాల
- పట్టించుకోని అధికారులు

మూత పడిన పాఠశాల

పాఠశాల వంట గదిలో ఖాళీ సిగరెట్ డబ్బాలు, బీరు సీసాలు

బోయినపల్లి, జనవరి 3: చిన్నారులకు, విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన సరస్వతి నిలయం.. అ సాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు మందు బా బులకు, చీకటి పనులకు ఇప్పుడు ఆ పాఠశాల నిలయమైంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. బోయినపల్లి మండల కేంద్రంలోని మర్లపేట దారిలో చక్కని గదులతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణం జరిగింది, తరగతి గదులు, వంట గది, మూత్రశాలలు, వరండతో ఖాళీ స్థలంతో పాఠశాల చక్కగా ఉన్నది. విద్యార్థులు లేక ఆ పాఠశాల 4 ఏళ్ల క్రితం మూతపడింది. ఆ పాఠశాలకు ఉపాధ్యాయుడు కేటాయించినప్పటికీ విద్యార్థులు లేక ఆ ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై చిన్న మల్కాపూర్ పాఠశాలకు పంపించారు. ఇప్పుడు ప్రస్తుతం ఆ పాఠశాల అక్రమార్కులకు చీకటి పనులకు, మందు బాబులకు నిలయంగా మారింది. పాఠశాల వంట గదిలో ఖాళీ సిగరెట్ డబ్బాలు, సిగరేట్ ముక్కలు, బీరు సీసా పగల కొట్టిన ముక్కలు, పాఠశాల గదిలో బీరువాలు కింద పడి, పాఠ్య పుస్తకాలు కింద పడి చిందర వందరగా ఉన్నది. ఇప్పుడు చక్కటి పాఠశాలను ప్రభుత్వ పనులకు ప్రభుత్వ భవనాలకు వినియోగించుకోవచ్చును కానీ, అధికారులు ఆ భవనాన్ని మరచి పోగా, ఇప్పుడు బీటలు వారి మందు బాబులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ పాఠశాలను ప్రభుత్వ కార్యలయాలకు గానీ, ఇతర ప్రభుత్వ పనులకు వినియోగించుకోవాల్సినవసరం ఉంది. ఈ విషయమై మండల ఇన్‌చార్జి విద్యాధికారి ప్రవన్‌కుమార్‌ను వివర కోరగా.. పాఠశాలలో విద్యార్థులు లేనందున పాఠశాల మూసివేయగా ఆ పాఠశాలను మిషన్ భగీరథ సిబ్బంది, ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర సిబ్బంది వినియోగిస్తున్నారు. మాకు ఎటువంటి సంబంధం లేదని వివరించారు.

సమస్యలను పరిష్కరించాలి

వేములవాడ రూరల్, జనవరి 3: వేములవాడ హమాలీ కార్మిక సమస్యలపై చేపడుతున్న సమ్మె మూడో రోజుకు చేరుకుంది. వారి సమస్యలను పరిష్కరించానలి సీఐటీయూ కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. పెరిగిన కూలీరేట్ ప్రకారం ఇవ్వాలని, దీపావళి బోనస్ అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులతో పాటు హమాలీ పాల్గొన్నారు.

ఇసుకను తరలిస్తున్న ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జనవరి 3: సింగారం మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. శుక్రవారం సింగారం వాగు వద్ద పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఎదురుగా ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి డ్రైవర్ ఆలకుంట రవిని ఆరా తీయగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు తెలిపాడు. దీంతో డ్రైవర్ రవి, యజమాని అల్లెపు కృష్ణయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

వినియోగదారుల సంక్షేమమే లక్ష్యం

చెక్కు అందచేస్తున్న సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి

ముస్తాబాద్, జనవరి 3 : వినియోగదారుల సంక్షేమమే సెస్ పాలక వర్గం లక్ష్యమని డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆవునూర్‌లో పేద కుటుంబం బత్తుల మల్లేశం యాదవ్‌కు చెందిన 13 గొర్రెలు మూడు మాసాల క్రితం విద్యుదాఘాతంలో మృతి చెందగా, సెస్ సంస్థ ద్వారా బాధిత కుటుంబానికి మంజూరైన రూ. 91 వేల చెక్కును సెస్ కార్యాలయంలో శుక్రవారం మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య సెస్ ఆవునూర్ గ్రామ ప్రతినిధి కనవేని పద్మరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ విష్ణు తేజ, జక్కుల నర్సయ్య, సెస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏజీపీగా బాధ్యతలు తీసుకున్న ప్రశాంత్‌కుమార్

వేములవాడ, జనవరి 3 : వేములవాడ సబ్ కోర్టు ఏజీపీగా న్యాయవాది బొడ్డు ప్రశాంత్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు లక్ష్మణాచారి, జ్యోతిర్మయి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం ఆయనను అభినందించారు. ఇక్కడ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల గౌడ్, అవధూత రజినీకాంత్, విద్యాసాగర్ రావు, రేగుల దేవేందర్, లింగాల నారాయణరావు, కొడిమ్యాల పురుషోత్తం, ఐలినేని కిశోర్ రావు, పొత్తూరి అనిల్ కుమార్, పెంట రాజు, అభిలాష్, కందుల క్రాంతి కుమార్, బొడ్డు దేవయ్య, సుజాత, అన్నపూర్ణ, చంద్రిక ఉన్నారు.

లయన్స్‌క్లబ్ విరాళం

ఎల్లారెడ్డిపేట, జనవరి 3 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు స్టడీ అవర్ సమయంలో అదనపు సమయం చదువుకున్న పిదప సాయంత్రం అల్పాహారం కోసం లయన్స్‌క్లబ్ వారు విరాళం అందజేశారు. శుక్రవారం లయన్స్‌క్లబ్ సభ్యులు కోట సతీశ్, ఎన్ వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా రూ.10 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి వాసరవేణి పర్శరాములు, లయన్స్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

సావిత్రీబాయి పూలే ఆశయ సాధనకు కృషి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ఊరూరా ఘనంగా పూలే జయంతి

సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, జనవరి 3 : సావిత్రీ బాయి పూలే ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆమె చిత్రపటానికి కలెక్టర్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ జిల్లా అధికారులతో కలిసి శుక్రవారం పూల మాలలు వేసి, నివాళులర్పించారు. మహిళల విద్యకు ఆద్యురాలిగా నిలిచి, సమానత్వానికి పోరాడారని వివరించారు. పూలె దంపతుల సేవలను త్యాగాలను గుర్తుచేసుకున్నారు. ఇక్కడ జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ చౌక్, జనవరి 3: సావిత్రిబాయిపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఐఈవో శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్, అంబేద్కర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయల ఆధ్వర్యంలో, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన వేడుకలకు హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్ఎంలు మల్లేశం, భాగ్యరేఖ, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

గంభీరావుపేట, జనవరి 3: మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూలే జయంతిలో సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు హాజరై మాట్లాడారు. మండలాధ్యక్షుడు లక్ష్మణ్, నేతలు పిట్ల బాబు, మచ్చ ఆనందం, నర్సయ్య, దేవయ్య, రమేశ్, బాలకృష్ణ, సంతోష్ తదితరులు ఉన్నారు.

కోనరావుపేట, జనవరి 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ధర్మారం గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తాలో సావిత్రీ బాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులను శాలువాతో సన్మానించారు. ప్రిన్సిపాల్ కేదారేశ్వర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్, జనవరి 3 : పట్టణంలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు కరస్పాండెంట్ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.

రుద్రంగి, జనవరి 3: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా ఉపాధ్యాయినులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

చందుర్తి, జనవరి 3: మండలంలోని సనుగుల ప్రాథమిక పాఠశాల, మల్యాల సాధన పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయుడు కట్కూరి ముఖేశ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పద్మ, నాగమణి, హరిష్మా, మాధవి, నవ్య, జోష్ణ, సంయుక్త, రాణి తదితరులు ఉన్నారు.

వేములవాడ, జనవరి 3 : వేములవాడ పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయులు రాధిక, రిజ్వాన, సుజాత్ సుల్తానా, సాయిరాను ఘనంగా సన్మానించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయులు సుజాతుల్లా, ఉపాధ్యాయులు దీకొండ విజయ్ కుమార్, మహేందర్, ఇక్కడ ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిక సంఘం కన్వీనర్ పొలాస నరేందర్, కౌన్సిలర్ కుమార్, సత్తయ్య ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట, జనవరి 3: ఎల్లారెడ్డిపేట, అల్మాస్‌పూర్, రాజన్నపేట, లో సావిత్రీబాయ్‌పూలే చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, పీఏసీస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి పాల్గొన్నారు.

ముస్తాబాద్, జనవరి 3: వివిధ గ్రామాల్లో సావిత్రీ బాయి పూలే విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ స్త్రీ సాధికారత కోసం, వారి హక్కుల కోసం కృషి చేసిన సావిత్రీ బాయి జీవితం దేశానికి ఆదర్శప్రాయమన్నారు. ఆయా గ్రామాల నాయకులు, వివిధ సంఘాల నాయకులు నిర్వహించారు.

ఇల్లంతకుంట రూరల్, జనవరి 3: ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★YRG CARE రామగుండం TI ప్రాజెక్ట్ పెద్దపల్లి జిల్లాలో పనిచేయుటకు 1 ORW (Out Rich Worker) కావలెను. Qly: 10th, HIV/AIDS నివారణలో పని చేసిన 3 సం||రాల అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును. జీతం: 10,500/- TA: 1500/- Application Last Date: 6-1-2025, Email:ramagundamti@yrgcare.org
సెల్: 6303172742, 9949464787
NTK-335657

PLOT FOR SALE

★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189